# సానుభూతి

కష్టాలంటే యేమిటో, కష్టాలు యెంత క్రూరమైనవో నాకు తెలుసు, మా కుటుంబానికి తెలుసు. ఆస్తిపాస్తులున్న వాళ్ళకు తెలుసు. అవి పోతున్న వాళ్ళకు తెలుసు. ఒట్టి కసిగాళ్ళకేం తెలుసు ?

నా చిన్నతనంలో మాకు రెండువందల యెకరాలకు పైగా భూమి వుండేది. తోటలూ, దొడ్లూ, యిళ్ళూ నాలుగైదు వూర్లల్లో వుండేవి. మా చుట్టుపట్ల పల్లెల్లో యిది నలువురికీ తెలిసిన సంగతే! వో అర్థమణుగు బంగారం మా యింట్లో వుండేదంట! మా జేజి చెప్పేది. మాకు దస్త్రంకూడా పెద్దగా వుండేదనీ, ఆ రోజుల్లోనే షుమారు రెండు మూడు లక్షల నగదు వుండి వుంటుందనీ వాళ్ళూ వీళ్ళూ అనుకుంటూ వుండేవాళ్ళు. వూరి పెత్తనమంతా ఆ రోజుల్లో మాదే. మా అబ్బదే ! పెరిగిపోతున్న ఆస్తీ, పరువు ప్రతిష్టలూ, చూచి విధికి మొదటిసారిగా కన్నుకుట్టింది. నాకు తెలిసి మా కుటుంబంమీదికి మొదటి పెద్ద కష్టం వచ్చిపడింది.

మా వూర్లో ప్రతి యేడాది దేవర జరుగుతుంది. దేవరలో మొదటి బోనం మాదే. ఆ యేడాది యేం పోయేకాలం వచ్చిందో మా వూరి మరో పెద్ద రయితు చెంచిరెడ్డి ఆ బోనం తమ కుటుంబానికి చెంది తీరాలన్నాడు. మా అబ్బ గాజులు తొడుక్కూనే బాపతు కాదు. గ్రామపార్టీ మొదలయింది. మా అబ్బ నాలుగు ఖూనీలు చేయించి, సుప్రీంకోర్టుదాకా వెళ్ళి అంత పెద్ద మర్డరు కేసులూ గెలుచు కొచ్చినాడు. కానీ మా దురదృష్టం! ఆఖరుకు ఆయన చెంచురెడ్డి పార్టీ వడ్డెవాళ్ళ చేతుల్లో ఖూనీ అయిపోయినాడు. చనిపోయినాక కూడా ఆయన్ని ప్రజలు మరిచి పోలేదు. మాటకోసం నిలబడిన మనిషి అనిపించుకున్నాడు. మా పరువు ప్రతిష్టలు పెరిగినాయి. కాని ఆయన చనిపోయేనాటికి మాకు నూరు యెకరాల భూమి మాత్రమే మిగిలింది. మిగతా ఆస్తి గ్రామ పార్టీకోసమే ఖర్చు కాలేదనే వాళ్ళున్నారనుకోండి. ఇంట్లో బంగారమంతా అబ్బ తిరుగుళ్ళకు పోయిందని మా జేజికూడా నాతో అనేదనుకోండి. ఏమైనా మా అబ్బా, కొంత ఆస్తీ పోవడం సామాన్యం కాదు.

మా అబ్బ ఖూనీకేసును మా నాన్న నడిపించక తప్పలేదు. ఆయన చెంచి రెడ్డినీ, వాళ్ళ కొడుకులందర్నీ గల్లుకు పంపించినాడు. అబ్బనికిమించిన కొడుకు అనిపించుకున్నాడు. కొంతకాలం మా కే కష్టాలూ లేవు. నేనూ, మా అన్నా చదు వుల్లో పడినాం. రాజాగా టౌనుచేరి నేను ఫస్టుఫారమూ, మా అన్న ఫోర్తు ఫారమూ చదువుకుంటున్నాం. సరిగ్గా ఈ రోజుల్లోనే మా నాయనకు మళ్ళీ ఒక గ్రామ పార్టీ తప్పలేదు. ఈసారి మా దాయాదులతోనే పార్టీ.

మా దాయాది పాపిరెడ్డిదీ, మావీ పక్కపక్క చేన్లే. గట్టుకూడా లేదు. పాపిరెడ్డికి వాళ్ళ సేద్యగాడు తంటా తెచ్చిపెట్టినాడు. సేద్యం చేస్తూచేస్తూ మా చేలో నాలుగు సాళ్ళు యెక్కువ పాసేనాడు. మా సేద్యగాడు యెందుకు వూరు కుంటాడు? పాపిరెడ్డి సేద్యగాన్ని చేలోనే పడేసి చావమోదినాడు. మా దాయాదు లకూ మాకు కురుక్షేత్ర యుద్ధం మొదలయింది. ఇంకా మా దాయాదులూ, మేమూ పంచుకోకుండా వున్న ఒకప్పటి అవిభక్త కుటుంబం తాలూకూ తోటలూ, దొడ్లూ, బంజర్లూ, వనాలూ—వీటి పంపకాల గొడవ పైకివచ్చింది. ఆస్తి గొడవలు సామాన్యమైనవి కావు. ప్రాణాంతకమైనవి. మా దాయాదులు మా నాయనను ఖూనీ కేసులో ఇరికించినారు. వాళ్ళవైపు మనిషిని వాళ్ళే చంపి, మా నాయనపై ఖూనీకేసు పెట్టినారు. ద్వీపాంతరం వెళ్ళేటట్లు చేసినారు. అప్పటికి ఇంకా పసివాళ్ళం. ఇంత పెద్ద కష్టానికి తట్టుకోలేకపోయినాం.

నా చదువుకేం దెబ్బ తగల్లేదు. కానీ, మా అన్న చదువు ఫిఫ్తుఫారంతోనే ఆగిపోయింది. ఇంటి పెత్తనం మా అన్నమీద పడింది. ఇంటో యింకేవళ్ళూ లేక పోవడంవల్లా, మా అమ్మ వెర్రిబాగుల్ది కావడంవల్లా, నిన్న మొన్నటిదాకా ఏ

అవస్థలూ లేవు. మా అన్న ఆశయాన్ని నెరవేర్చటానికీ, డిపై. ఎస్. పి. కావడానికి చదువుతున్నా నేను. ఎం. ఏ., ఈ యేడాది పూర్తవుతుంది.

కానీ అదేమో మేము కష్టాలు పడడానికే పుట్టినట్లుంది. ఈ మధ్య కొత్త శని పట్టుకుంది. నలమహారాజును కలిపురుషుడు చుట్టుకున్నట్లు మా వూరి మాదిగలు చుట్టుకున్నారు. ఏటిగడ్డను ఇరవై యేండ్లనుంచి సాగుచేసుకుంటే చేసుకోవచ్చుగాక, పట్టా మాది అయినప్పుడు మా భూమి మాకు దఖలుపరచడం న్యాయం. మా అన్న న్యాయంగా అడిగి చూసినాడు. వాళ్ళెందుకు వింటారు? తెలివిమీరిన జనం. బరితెగించిన జనం. వాళ్ళంటారంటకదా :

"ఇంతకాలం భూమిని సాగుచేస్తూంటే యెందు కూరుకున్నారు? భూమి పక్వాని కొచ్చిందని గోసులు విప్పుకొని వచ్చినారు – దొంగపట్టాలు కాని. మే మియ్యం. యెందుకియ్యాల? యేమైతే అదవుతుంది."

యింత పొగరు వాళ్ళకే వుంటే ఆస్తిపరులు కెంత వుండాలి? రైతులందరూ కలసి – 'చిల్లర జనం పొగరు అణచాల్సిందే' అన్నారు. ఇష్టం లేకపోయినా మా అన్న పార్టీ లీడరయ్యాడు.

యిప్పుడు మా వూళ్ళో పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. మాదిగ లొకవైపూ, రైతులొకవైపూ.

ఏం జరుగుతుందో! నెత్తి మాసిన వాళ్ళకు ఏ పార్టీలు పెట్టుకున్నా వూడేది లేదు. పైగా వాళ్ళను సమర్థించేవాళ్ళు నన్ను కూడా ఏ కేసుల్లోనన్నా యిరికిస్తారేమోనని మా వూరి ఛాయల వైపుకే రావద్దని మా అన్న ఆదేశించాడు. ఈ కలిపురుషుల నుంచీ మా కుటుంబం యెప్పుడు బయటపడుతుందో!

నా బుద్ధి గడ్డితిని ఈ మాటే అన్నాను, మా యింటి కథ అంతా చెప్పి – మా క్లాసుమేటు రామకృష్ణతో. 'మీరు కాబట్టి ఇన్ని కష్టాలకు తట్టుకున్నారు! మరొకళ్ళయితేనా?' అంటాడనుకున్నాను. కానీ వాడంటాడుకదా :

"మీ యింటి కథ తెలుగు సినిమా కథకు సరిపోతుంది. సినిమాలో కన్నీళ్ళూ, సినిమా తీసినవాళ్ళకు డబ్బులూ, బుద్ధీ జ్ఞానం వున్నవాడెవడూ మీ యేడ్పులకు బాధపడడు. మీ వేం కష్టాలు? తెచ్చిపెట్టుకొన్న కష్టాలు. నిజమైన అవస్థలంటే మీ వూళ్ళో హరిజనులు పడే అవస్థల్లాంటివి. వాళ్ళ గోడుకు వాళ్ళు కారణం కాదు; మీరూ, కావలసినంత సొంత ఆస్తులున్న మీలాంటి వాళ్ళూ. అవేమీ లేని వాళ్ళకు అవసరం ప్రేమా, సానుభూతీ మీ కెందుకూ?"

దక్కిన ఆస్తిని నిలబెట్టుకోడానికి మామీద తిరగబడిన మా వూరి మాదిగలే నయం వీడికంటే. వీడి ప్రేమా, సానుభూతి లేకపోతే పోయె! ఆస్తుల్లేకుండా చేయాలనే పిచ్చి కర్కోటకుల రకం. వీళ్ళతో ఏం మాట్లాడగలం? ●

ఫిబ్రవరి 1976, యువజన మాసపత్రిక.